# ఇవాళ...

విశాఖపట్నం నేషనల్ హైవే రోడ్డు మీద నడుస్తున్నాను. కొత్త రోడ్డు చేరుకున్నాను. సూర్యుడు కోపంగా, ఎర్రగా చూస్తున్నాడు. గాలి వేడిగా వీస్తోంది. వందలాది కూలీలు అక్కడకు చేరుకుంటున్నారు. కొంతసేపు అక్కడ నిలబడ్డాను. పోలీసులు కూలీలను తరుముతున్నారు. ఎందుకో తెలీదు! ఏం జరుగుతుందో తెలీదు! ఏవీ అర్థం కాలేదు! ఏం జరుగుతోందో ఎవరికీ తెలీదు! జోరుగా ముందుకి నడుస్తున్నాను.

సూర్యుడు మండుతున్నాడు. గాలి వేడి వేడిగా వీస్తోంది.

కళ్లు మూసుకుని నడుస్తున్నాను. నోరు మూసుకుని నడుస్తున్నాను. ముక్కు మూసుకుని నడుస్తున్నాను.

రోడ్డుకి రెండువైపులా, అల్లుకున్న ముళ్ల పొదలు... దట్టమైన పొదలు.. వాటి చాటున ఆడవాళ్లు... లేస్తున్నారు... కూర్చుంటున్నారు... కళ్లు మూసుకుని నడుస్తున్నాను... నోరు మూసుకుని నడుస్తున్నాను... ముక్కు మూసుకుని నడుస్తున్నాను... ఆడవాళ్లు కాలకృత్యాలు తీర్చుకుంటున్నారు... ఏం చేస్తారు?!... తప్పు వాళ్ళది కాదు... రోడ్డు మద్దిన నడిస్తే వాహనాల భయం... రోడ్డుకి అటూ ఇటుగా కాలుపెట్టలేం... రోడ్డు మద్దిన మాత్రం ఎత్తుచేసి మొక్కలు నాటుతున్నారు... ఎందుకు?!... ఎవరికోసం?!... ప్రపంచ బ్యాంకు అప్పా?!... ఎవరో ఆ ఆడవాళ్ల మీదకు రాళ్లు రువ్వుతున్నారు!... ఎవరో?!... ఎందుకో?!... కళ్లు మూసుకుంటూ విప్పుతూ, విప్పుతూ మూసుకుంటూ, జోరుగా నడుస్తున్నాను. ఈగలు మూడో నాల్గో నా చెవుల చుట్టూ తిరుగుతూ వెంటాడుతున్నాయి. జోరు ఎక్కువ చేసి, జోరీగలని తరుముతూ, జోరు జోరుగా నడుస్తున్నాను.

కొంత దూరం నడిచేను. కళ్లు పూర్తిగా విప్పి నడుస్తున్నాను. ఆయాసం వస్తోంది. జోరు తగ్గించాను. ఏవేవో కేకలు... అరుపులు... బూతులు... పక్కకు తిరిగి చూశాను.

నీటి కొళాయి... బారులు బారులుగా బిందెలు.... కన్నీటి చుక్కల్లా నీటి చుక్కలు... నానే ముందొచ్చేను... కాదు కాదు నానే ముందొచ్చాను... పిల్లల మీది పెమాణంసేసి సెబుతున్నా... దేవుడి మీది ఒట్టేసి సెబుతున్నా... నా నెత్తిమీది

సెయ్యేసుకు సెబుతున్నా... ఎన్ని బిందెలట్టుకెళతావేటి?.... మావేమైపోవాల?... గుండెమీద గుద్దీగల్లు... ఏవేవో బూతులు... శరీర భాష... ఏవేవో కేకలు... ఏవేవో అరుపులు... తోసుకుంటున్నారు... గుద్దుకుంటున్నారు... చీరలు చింపేసుకుంటున్నారు... కొప్పులు పీకేసుకుంటున్నారు... రవికెలు చింపేసుకుంటున్నారు... పిల్లలు భోరు భోరున ఏడుస్తున్నారు...

సూర్యుడు మండుతున్నాడు. సూర్యుడికి తన కోపాన్ని ఎవరిమీద చూపాలో తెలీదట! వాళ్లకి కూడా అంతే? ఎందువల్ల...?!

ముందుకి నెమ్మది నెమ్మదిగా సాగుతున్నాను. అంతా భయం భయంగా కనిపిస్తోంది. ఎక్కడ చూసినా పోలీసు వాహనాలు! ఎక్కడ చూసినా గుంపులు గుంపులుగా పోలీసులు! మూకలు మూకలుగా పోలీసులు! తెల్ల తెల్లని దుస్తుల్లో పోలీసులు పోలీసులు! యుద్ధ వాతావరణం! ఏం జరిగింది?! ఏం జరుగుతోంది?! సూర్యుడు విరిగి పడిపోయాడా?! అంతటా భయం భయం!! యువకులను పోలీసులు ప్రశ్నిస్తున్నారు!! తరుముతున్నారు!! వాహనాలను పోలీసులు ఆపేస్తున్నారు! అడుగుతున్నారు!! దండుకుంటున్నారు!! ఏవైందేవైంది!! అంతటా భయం భయం!!

భయం భయంగా అటూ ఇటూ చూస్తూ నెమ్మది నెమ్మదిగా ముందుకు సాగుతున్నాను. సాగిపోతున్నాను. భయం భయం!! చూశాను.. తెప్పరిల్లాను... కోలుకున్నాను... నవ్వుకున్నాను... పెద్ద పెద్ద బ్యానర్లు... ప్రపంచ తెలుగు మహాసభలు... బిగ్గర బిగ్గరగా నవ్వుకుంటూ, పగలబడి విరగబడి నవ్వుకుంటూ, చల్లబడ్డాను. ముందుకి సాగిపోతున్నాను.

అనుకోకుండా ఆకాశంలో తెల్ల తెల్లని మబ్బులు. అవి కురిసే మబ్బులు కాదు. మెల్ల మెల్లగా అటూ ఇటూ తిరుగుతున్నాయి.

ఆకాశంలోకి చూస్తూ నడుస్తున్నాను. ఆకాశం సామ్రాజ్యవాదంలా కనిపిస్తోంది.

ఒక పెద్ద పార్కులోకి వెళ్లేను. పొదల వెనక పచ్చని గడ్డిమీద కూర్చున్నాను. ఒంటరిగా అలజడిగా కూర్చున్నాను. చెట్లు గాలిలో ఊగుతున్నాయి. నీడల్ని పరుస్తున్నాయి. అవి చల్లగా చెదిరిపోతున్న చల్లని కలల్లా వున్నాయి.

నాకు సమీపంగా వున్న బల్లమీద ముగ్గురు కూర్చున్నారు. ఒకడి వయసు

ముప్పై వుంటుంది. ఇద్దరి వయసు నలభై దాటి వుంటుంది. ఏవేవో పరిశ్రమల గురించి మాట్లాడుకుంటున్నారు. పారిశ్రామికవేత్తల్లా వున్నారు. సామ్రాజ్యవాదంలా కనిపిస్తున్నారు. ఏవేవో మాట్లాడుకుంటున్నారు.

... దీన్ని పెద్ద పర్యాటక మహానగరంగా చేస్తారు... మనమే ఆ పని చేద్దాం... ఆ పని మనకే దక్కేలా చూసుకోవాలి... చేసుకోవాలి... ప్రైవేటీకరణలో చాలా చురుగ్గా, చాలాచాలా చురుగ్గా, చాలా చాలా జోరుగా పనిచేస్తున్నారు... ఈ పని మనకే దక్కేలా చేసుకోవాలి... వాళ్ల హోటళ్ల వ్యాపారం అభివృద్ధి కావాలంటే పర్యాటక వ్యాపారాన్ని అభివృద్ధి చేయకతప్పదు... మద్యపానాన్ని చట్టబద్ధం చేసేశారు... వ్యభిచారాన్ని కూడా చట్టబద్ధం చేసేస్తారు. నగ్న నృత్యాలను చట్టబద్ధం చేసినా చేయకపోయినా అవి ఎప్పుడూ జరుగుతూనే వున్నాయి... జరుగుతూనే వుంటాయి... ఇక్కడ పర్యాటక పరిశ్రమ తప్పక అభివృద్ధి చేస్తారు చేస్తారు... ఆ పని మనకే దక్కేలా చేసుకోవాలి... వాళ్లకి కావాల్సింది వాళ్లకు పారేద్దాం... కోట్లు కోట్లు...

అలా ఏవేవో మాట్లాడుకుంటూ లేచి నిలబడ్డారు. అటూ ఇటూ ఇటూ అటూ - చూస్తూ నిలబడ్డారు. సముద్రం వైపూ - కొండల వైపూ - తేరిపారి చూస్తూ నిలబడ్డారు. ఏవేవో మాట్లాడుకుంటూ వెళ్లిపోయారు.

ఎక్కణ్ణుంచో వచ్చిన ఓ గెద్ద రివ్వు రివ్వున ఎగురుతోంది. పచ్చ గడ్డిలో పొట్టకోసం పరుగులు తీస్తున్న ఓ కప్పను తన్నుకుపోయింది. రివ్వు రివ్వున ఎగిరిపోయింది.

అక్కణ్ణుంచి కదిలేను. దట్టంగా వున్న పొదలవేపు వెళ్లేను. జడల పొదల దగ్గర కూర్చున్నాను. పెద్ద పెద్ద చెట్ల చిక్కని చల్లని చీకటి నీడలు. ఎత్తయిన దట్టమైన పొదల గుంపులు. చీకటి చీకటి. నీడల చీకటి. చిక్కటి చీకటి. చీకటిని చీల్చుకుంటూ ఏవేవో చిరు కబుర్లు. పొదల మధ్య పచ్చ పచ్చని గడ్డిలో చీకటి చీకటి నీడల్లో ఇద్దరు యువకులు... దగ్గర దగ్గరగా... ఏవేవో చీకటి కబుర్లు... చీకటి చీకటి కబుర్లు...

...పెద్ద చదువులే చదివేశాం... ఏం లాభం... ఉద్యోగాల్లేవు... చదువు పెట్టుబడి... ఉద్యోగం పెట్టుబడి... ప్రతీదీ వ్యాపారం... ప్రతీదీ పెట్టుబడి... మేధస్సుకి విలువలేదు... ప్రతిభకి విలువలేదు... ఏ విలువకీ విలువలేదు... ఉన్నది కాస్తా ఖర్చు చేసేసి కాల్చేసుకొని మరీ చదివేం... ఏం లాభం ఏం లాభం... స్వేచ్ఛా

వ్యాపారమట.. పోటీ అట... పోటీతత్వమట... ఎవరి కోసం?!... ఎందుకోసం?!... ఎక్కడ చూసినా నిరుఉపాధి... నిరుద్యోగం... ఉద్యోగాలు పోయి వీధిన పడుతున్నారు... మనకి మరింక ఉద్యోగాలు రావు... ఉపాధి దొరకదు... పెట్టుబడి లేదు... పెళ్లిళ్లు కావు... మనకి ఆడవాళ్లొద్దు... పిల్లలొద్దు... యవ్వనం ఊరుకోదు... వయసు అల్లరిపెట్టక మానదు... ఇలాగే ఇలాగే మనిద్దరం... జంట జంటగా... చెట్ల చీకటి చీకటి నీడల్లో... పచ్చ గడ్డి పరుపుల్లో... సుఖిద్దాం... ఓహో! ఎంత సుఖం! ఆహా! ఎంత సుఖం!...

నా తల తిరిగిపోతోంది. ప్రకృతి పకపక నవ్వుతోంది. సూర్యుడు కళ్లు మూసుకుని చీకటి మబ్బుల్లోకి వెళ్లిపోయాడు. చెట్లనీడలు చీకటిని చీకటి చీకటి చేస్తున్నాయి.

"...పెద్ద పెద్ద పెట్టుబడులు పెట్టేవాళ్లు పెద్ద పెద్ద నేరాలు చేస్తున్నారు... ఉద్యోగం ఉపాధి లేనివాళ్లు చిన్న చిన్న నేరాలు చేస్తారు... చేస్తున్నారు... ఇదీ ఇవాళ మన నేరవ్యవస్థ...' అని అదంతా చూసిన ఎవరో చెప్పుకుంటూ వెళ్లిపోయారు.

అక్కణ్నుంచి బయల్దేరాను. మాధవధార బస్సు ఎక్కేను. నా ముందు సీట్లో ఓ స్త్రీ కూర్చుంది. కండక్టరు ఆమె పక్కకు చేరాడు. ఆఖరి స్టాపు దగ్గరపడుతోంది.

'... ఇయ్యాల నిన్నొగ్గను! సూసుకో!...'

'... సెవులు కోసేసిన ఏనుగు మొగం నువ్వూనూ!... డబ్బులు రాల్చవు... నువు బోణీ కొడితే ఇయ్యాలల్లా ఏడుపునాగే వుంటాది!... నాలుగు బేరాలు దొరికినాక రా!... ఎదవ దొంగ మొగం నువ్వూనూ!.. ఫో ...'

బస్సు ఆగింది. అందరం దిగిపోయాం. తోటల్లో చెట్లకింద పొదల్లో చీకటి చీకటి నీడల్లో కొందరు యువకులు జంటలు జంటలుగా కూర్చున్నారు.

'ఎల్లు!... బేరాలు ఎదురుసూత్తన్నారు!...'

'... అయి డబ్బులు రాల్చే బేరాలు కాదు... సదువుకున్నారంత... ఉజ్జోగాలు నేవంత... పెల్లాం కావాలన్నా డబ్బు కావాల... ముండ కావాలన్నా డబ్బు కావాల... ఆళ్లకాడ కాణీకూడా నేదు... ఆళ్లల్లో ఆళ్లే కింద మీదా

పడతావుంతారు... ఏటి సేత్తారు?!...' ఆమె విషాదంగా చీకటిగా నవ్వుతూ చీకటి నీడల్లోకి వెళ్లిపోయింది.

'... అభివృద్ధి అంటే ఏంటి?!... అభివృద్ధి అంటే ఏంటి?!... అభివృద్ధి అంటే ఏంటి?!...' అని ఓ యువకుడు మంటలా మండుతూ మంటలా ప్రశ్నిస్తూ సూర్యుల్లా మండుతూ వెళ్లిపోయాడు.

★ ★ ★

(గ్లోబలైజేషన్ కథలు - విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్ । మార్చి 2003)

(హిందీ అనువాదం - స్రవంతి - ద్విభాషా మాసపత్రిక - హైదరాబాదు - జనవరి 2005. అనువాదకులు: డా॥ ఎన్.ఎ. సూర్యనారాయణవర్మ)

-----